ప్రజాశక్తి
సోమవారం 8 డిసెంబర్ 2025
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ఉపాధికి ఊతమేది?



- ఎనిమిది నెలల్లో వచ్చిన పెట్టుబడి రూ.26.81 కోట్లు మాత్రమే
- అసంపూర్తిగా ఎంఎస్‌ఎంఇలకు రాయితీ విడుదల
- ప్రభుత్వ మాటలు నీటిమూటలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

లక్షల కోట్ల రూపాయల ప్రయివేటు పెట్టుబడులను తీసుకువచ్చి భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయించి యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు క్షేత్రస్తాయిలో పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఎనిమిది నెలలను పరిశీలించినప్పుడు ఈ విషయం తేటతెల్లం అవుతుంది. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎం)లకు సకాలంలో రాయితీలు ప్రభుత్వం పూర్తి స్థాయిలో విడుదల చేయడం లేదని ఎంఎస్‌ఎంఇ లబ్ధిదారులు వాపోతున్నారు.

కృష్ణాజిల్లాలో రూ.26.81 కోట్లతో 794 సూక్ష్మ, మధ్య, చిన్న తరహా (ఎంఎస్‌ఎంఇ) యూనిట్లను ఏర్పాటు చేయగా, ఈ మొత్తం యూనిట్లలో 2,497 మందికి మాత్రమే ఉపాధి లభించిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు మచిలీపట్నంలో ఉన్న బెల్ కంపెనీ పామర్రు మండలం నిమ్మకూరులో ఏర్పాటు చేయడానికి ఈ ఏడాది నూతనంగా నిర్మించిన యూనిట్‌కు కేంద్రం రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు ప్రభుత్వం చూపుతోంది. ఇక్కడ మచిలీపట్నంలో పనిచేసే ఉద్యోగుల తరలింపు మినహా నూతన ఉద్యోగాల కల్పించే పరిస్థితి లేదు. ఈ మార్పు మినహా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించే ఒక్క భారీ పరిశ్రమలు ఏర్పాటు అవ్వలేదు.

అసంపూర్తిగా రాయితీలు విడుదల

ఎంఎస్‌ఎంఇ యూనిట్ల పెట్టుబడులపై ఎస్‌ఇ, ఎస్‌టిలకు 45 శాతం, ఓసి, బిసిలకు 15 నుంచి 25 శాతం వరకు రాయితీలు, యూనిట్లు వినియోగించే విద్యుత్ యూనిట్‌కు రూ. 1 నుంచి రూ.1.50 వరకు తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నాలుగు సంవత్సరాల తర్వాత ఇటీవల ఈ రాయితీలను విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే జిల్లాలో 271 యూనిట్లకు రూ.121 కోట్ల 41 లక్షలు రాయితీ విడుదల చేయాలి. రూ. 92.24 కోట్లు విడుదల చేసినట్లు చెబుతున్నా కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (సిఎఫ్‌ఎంఎస్) లోపాలతో 67 యూనిట్ల నిర్వహకులకు రాయితీలు జమ కాలేదు. ఈ నేపథ్యంలో రాయితీలను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని ఎంఎస్‌ఎంఇ నిర్వాహకులు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అమరావతి బాలోత్సవం ప్రతినిధులు

అమరావతి బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అమరావతి బాలోత్సవం ఈ నెల 9 నుండి నిర్వహించనున్నట్లు బాలోత్సవం అధ్యక్షులు ఎస్. పి.రామరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు తెలిపారు. మొగల్రాజపురంలోని సిద్దార్థ ఆడిటోరియంలో ఆదివారం బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వరుసగా ఎనిమిదో సారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో కృష్ణా, ఎన్‌టిఆర్, ఏలూరు, గుంటూరు జిల్లాలోని 200 పాఠశాలల నుండి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనున్నారని చెప్పారు. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం అనే నినాదంతో 43 అకడమిక్, 17 కల్చర్ అంశాలలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను 9వ తేదీ ఉదయం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, మాజీ శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గుడివాడలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

దళారులదే రాజ్యం..!

- ధాన్యానికి దక్కని మద్దతు ధర
- ఆందోళనలో రైతులు, కౌలురైతులు

ప్రజాశక్తి-మొవ్వ, గుడివాడ

ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతులకు కష్టాలు తప్పడం లేదు. విత్తనం విత్తిన నాటి నుంచి పంట చేతికొచ్చి అమ్ముకునే దాకా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఒక వైపు అకాల వర్షాలు..వ ఎరో వైపు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతులతో రైతులు సతమతమవుతున్నారు. ధాన్యానికి కనీస మద్దతు ధర అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మారుతున్నాయి. ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు, దళారులు ఆడింది ఆటగా సాగుతుంది. రైస్‌మిల్లర్ల కనుసన్నల్లో రైతు సేవ కేంద్రాలు పని చేస్తున్నాయని రైతులకు న్యాయంగా రావాల్సిన ధర దక్కట్లేదని రైతులు వాపోతున్నారు. ఆర్‌ఎస్‌కెలో నిర్ణయించిన తేమ శాతాన్ని ఏ రైస్ మిల్లు కూడా పరిగణనలోకి తీసుకోవట్లేదు. రైస్‌మిల్లు తేల్చిన తేమ శాతం నికరం కావడంతో ఆర్‌ఎస్‌కెలు ఉన్నా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు.

వార్త 2లో

జాబ్‌చార్ట్ అమలెక్కడ?

- సంబంధం లేని సర్వేలు
- సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి
- ఉద్యోగం వదిలి వెళ్లిపోతున్న సిబ్బంది?

ప్రజాశక్తి-విజయవాడ

ఉన్నత చదువులు చదువుకుని ఎంతో కొంత కుటుంబానికి ఆసరాగా ఉంటుందనే ఆశతో ఉద్యోగంలో చేరిన వార్డు సచివాలయ ఉద్యోగులు జాబ్‌చార్ట్‌తో సంబంధం లేకుండా చేయిస్తున్న పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో విజయవాడ నగరపాలక సంస్థలోని పలువురు వార్డు సచివాలయ ఉద్యోగులు రిజైన్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. పని ఒత్తిడి తట్టుకోలేక గత నాలుగు రోజుల క్రితం ఆరో డివిజన్ 34వ నెంబర్ సచివాలయంలో అడ్మిన్ సెక్రటరీగా పని చేస్తున్న టి.లావణ్య రిజైన్ చేసినట్లు తెలిసింది. ఇదే బాటలో మరికొంత మంది ఉన్నట్లు



తెలిసింది. జాబ్‌చార్ట్ అమలు కోరుతూ కోరుతూ రెండు నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించిన వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రిన్సిపల్ సెక్రటరీ కాటంనేని భాస్కర్, గ్రామ, వార్డు సచివాలయ డిపార్టుమెంట్ డైరెక్టర్ యం.శివప్రసాద్‌లను కలిసి వినతిపత్రం అందజేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా కనిపించలేదని సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. తాము చదువుకున్న చదువుకు, ఇచ్చిన ఉద్యోగానికి సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, ఇదేమని (మిగతా 2లో)

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీ డిమాండ్
- అధ్యక్ష, కార్యదర్శులుగా కుమారస్వామి, వెంకటేశ్వరరావు



ఎస్‌ఎఫ్‌ఐ ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీ

ప్రజాశక్తి-తిరువూరు

ఎస్‌ఎఫ్‌ఐ ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 5, 6 తేదీల్లో తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ 53వ జిల్లా మహాసభలో అధ్యక్ష, కార్యదర్శులుగా టి.కుమారస్వామి, చిమట వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కుమార్‌నాయక్, ప్రణీత, ప్రణయ్, సహాయ కార్యదర్శిగా కాజు, మాధవ్, ఉష, యశస్వినితో పాటు మరో 11 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. (మిగతా 2లో)

నేడు వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 8వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చుని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

దళారులదే రాజ్యం..!

• ధాన్యానికి దక్కని మద్దతు ధర • ఆందోళనలో రైతులు, కౌలురైతులు

ప్రజాశక్తి-మొవ్వ, గుడివాడ

ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలోని అత్యధికంగా కృష్ణా జిల్లాలో 1.55 లక్షల హెక్టార్లలో వరి పంట సాగైంది. అక్టోబరులో వచ్చిన మొంథా తుఫాన్ దెబ్బకు వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తరువాత దిత్వా తుఫాన్ ప్రభావం కారణంగా సాధారణ పద్ధతుల్లో వరి కోతలు కోసేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ నెల 4వ తేదీ వరకు యంత్రాలతోనే వరి పంటను నూర్పిడి చేశారు. వాతావరణ మార్పులకు కారణంగా ఆరబెట్టుకునే అవకాశం లేకపోవడంతో యంత్రాలతో నూర్చిన వెంటనే మిల్లుకు తరలించారు. ఈ క్రమంలో రైతు అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు రైస్ మిల్లర్లు, దళారులు నాణ్యమైన ధర అందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం చూడకుండా 75 కేజీలు బస్తా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.1,575, కామన్ రకానికి రూ.1,450 ధరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మానుగాయ లేకుండా 17 శాతం తేమ ఉంటే ఏ గ్రేడ్ ధాన్యానికి బస్తాకు రూ.1792, కామన్ రకానికి రూ.1777 చెల్లించాల్సి ఉంది.

మొవ్వ మండలంలో మానుగాయ లేని 18 శాతం తేమ ఉన్న ధాన్యానికి సగటున రైతులకు ఆర్ఎస్‌కే ద్వారా అమ్మగా రూ. 1400 నుంచి రూ.1500 వరకు వచ్చింది. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధర దక్కని పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ వల్ల వరి పంటకు మానుగాయ వచ్చిన రైతులకు నిబంధనలు మార్చి ఆదుకుంటామన్న భరోసా కూడా ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. తుఫాన్ వల్ల మానుగాయ ఉన్న వరి ధాన్యం బస్తా 1000 నుంచి 1200 రూపాయలకు ప్రైవేట్ వ్యాపారస్తులకు రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఒక్కొక్క రైతుకు బస్తాకు 100 రూపాయలు నుండి 250 వరకు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో దెబ్బతిన్న ధాన్యానికి కొనుగోలు చేయడానికి గతంలో ప్రభుత్వాలు నాణ్యత ప్రమాణాలు కొంతమేర సడలించాయి. కూటమి ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలు సడలించకపోవడంతో రంగు మారిన ధాన్యాన్ని అడిగినంత ధరకు అమ్ముకోవాల్సిన వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మొవ్వ మండలంలో 1700 రూపాయలకు ధాన్యాన్ని అమ్మిన రైతులను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతిన్న రైతు, కౌలు రైతులు మరొక రకంగా ప్రభుత్వ విధానాల వల్ల పూర్తిగా అప్పులు పాలై నష్టపోయారు. ఇంకా జిల్లాలో దెబ్బతిన్న ధాన్యం లక్షల క్వింటాల్లో రాబోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని దెబ్బతిన్న, రంగు మారిన ధాన్యానికి నిబంధనలను సడలించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం, కౌలురైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వరుస తుఫాన్ల వల్ల మానుగాయ రావడంతో ధాన్యంలో తప్ప, తాలు ఎక్కువగా వచ్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. మొంథా తుఫాన్ ప్రభావం ఒక ఎత్తయితే ద్విత్వా తుపాను రైతులకు మరింత నష్టం చేకూరింది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో తుపాన్లు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గుడివాడలో యంత్రాలతో కోత కోసి ధాన్యపు గింజలను రహదారులపై ఆరబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యాన్ని గుట్టలుగా వేయడానికి కూలీలను పెట్టి పని చేయించడానికి రోజుకి ఒకరికి 500 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలుపుతున్నారు. కౌలు రైతులు నేరుగా మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని అడుగుతుంటే ఖాళీ లేదని చెప్పడం, కొనుగోలు చేయడం కుదరదని చెప్పడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటు ప్రభుత్వం మరొకవైపు ప్రైవేటు వ్యక్తులు కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు మరింత దిగాలు చెందుతున్నారు. ఒక పక్క వరి కోతలు, మరోపక్క గట్టుకు చేర్చిన ధాన్యంలో తేమ శాతం తగ్గించుకునేందుకు ఎండబెట్టుకుంటే వర్షాలు ఎప్పుడు కురుస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ధాన్యాన్ని ఆరబెట్టాలని ఎక్కువ మంది కూలీలతో పనులు చేయించి ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం అధికంగా ఖర్చులు చేయాల్సి వస్తుందని తెలుపుతున్నారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి తేమ శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పిన రైతులు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

నీలం మురళీకృష్ణారెడ్డి, రైతు సంఘం నాయకులు

ప్రభుత్వం రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి. తుపాన్ల వల్ల రైతులు, కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారు. ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. మిల్లుల వద్ద ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు త్వరగా అన్‌లోడ్ చేసేలా అధికారులు మిల్లర్లతో చర్చించాలి.

రైతులు ముందుగా పిఎసిఎస్‌కి వెళ్లాలి

బి.అనంతలక్ష్మి, గుడివాడ మండల వ్యవసాయాధికారిణి

రైతులు నేరుగా రైస్ మిల్లుల వద్దకు వెళ్లి మోసపోవద్దు. ముందుగా పిఎసిఎస్‌లకు ధాన్యం శాంపిల్‌ను తీసుకెళ్లాలి. అక్కడ నుండి అధికారుల సూచనల మేరకు రైస్ మిల్లుల వద్దకు ధాన్యాన్ని తీసుకెళ్లాలి.

మొదటిపేజీ తరువాయి

జాబ్‌చార్ట్ అమలెక్కడ?

అడిగితే చేస్తే చేయండి... లేదంటే వెళ్లిపోండని ఉన్నతాధికారులు సమాధానమిస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాబ్‌చార్ట్ ప్రకారం తమకు అప్పగించిన వర్క్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలికాన్ఫరెన్స్‌లు, జూమ్ మీటింగ్‌లు, విద్యార్థుల డేటా ప్రాసెసింగ్, పురమిత్ర సర్వేలు, ఈకెవైసి సర్వేలు, వర్క్‌ఫ్రమ్ హోమ్ ఎగ్జామ్స్ నిర్వహించడం, సచివాలయ నిర్వహణ, ట్యాక్స్ కలెక్షన్, పన్నులు వేయడం, సర్వే రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపించడం తదితర అనేక రకాల పనులు రాత్రి తొమ్మిది గంటల వరకూ కూడా చేసినా ఇంకా పని ఎదురు చూస్తూనే ఉంటుందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. విజయవాడ నగరపాలక సంస్థలో 64 డివిజన్ల పరిధిలో 286 సచివాలయాల ఉండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డు సచివాలయ వ్యవస్థలో చోటుచేసుకున్న మార్పులు చేర్పుల వల్ల ప్రస్తుతం నగర వ్యాప్తంగా ఉన్న వాటిల్లో సగం సచివాయాల్లో మాత్రమే యాక్టివ్‌గా వివిధ రకాల పనులు నడుస్తున్నట్లు సమాచారం. అయితే ప్రతి వార్డు సచివాలయం పరిధిలో తొమ్మిది విభాగాలు పని చేస్తున్నాయి. ఈ లెక్కన నగర వ్యాప్తంగా ఉన్న 286 సచివాలయాల పరిధిలో 2,574 మంది ఉద్యోగులు ఉండాలి. కానీ నేడు 1600 మందిలోపే ఉద్యోగులున్నట్లు సమాచారం. పని భారంతో పలువురు ఉద్యోగులు రిజైన్ చేయగా, 300 నుంచి 400 మంది వరకు డిప్యుటేషన్‌పై వేరే డిపార్టుమెంట్స్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఈ ఉద్యోగులందరూ ఉన్నత స్థాయి విద్యనభ్యశించిన వారే. అత్యధిక మంది బిటెక్, ఎంటెక్, డిగ్రీ, పిజి, పిహెచ్‌డి, లా, పలువురు డాక్టర్లు కూడా ఉన్నారు. వీరందరూ వార్డు సచివాలయాల పరిధిలో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ (ఇడిపిఎస్) సెక్రటరీ, వెల్ఫేర్ సెక్రటరీ, ప్లానింగ్, ఎమినిటీ, మహిళా పోలీసు, విఆర్ఒ, హెల్త్ సెక్రటరీ ఇలా తొమ్మిది రకాల విధులు నిర్వర్తించాల్సి ఉంది. తగినంత మంది ఉద్యోగులు లేనందున రెండు, మూడు విభాగాలకు సంబంధించిన పనులను ఒక్కరే పర్యవేక్షిస్తూ, పని చేయాల్సి వస్తోందని ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తించే విధంగా ప్రభుత్వం చూడాలని, లేకపోతే ఆందోళన బాట తప్పదని వార్డు సచివాలయ ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

ఈ సందర్భంగా విద్యా రంగంలోని పలు సమస్యలపై తీర్మానాలు చేశారు. తిరువూరు పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నడపాలని, జిల్లాలో సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, రెగ్యులర్ వార్డెన్లను కేటాయించి మెస్ ఛార్జీలు నెలకు కనీసం రూ.మూడు వేలకు పెంచాలని, ప్రభుత్వ హామీ ప్రకారం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం రూ.15 వేలు అందించాలని, జీవో 77 రద్దు చేసి పీజీ విద్యార్థులకూ ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వాలని, నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం డిగ్రీ కళాశాల, మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, జూనియర్, డిగ్రీ కళాశాల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ స్కూల్స్, కాలేజీ హాస్టళ్లలో మెరుగైన సబుపాయలు కల్పించాలని తీర్మానించారు.

22 నుంచి సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ : రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ఏసీఏ తరుపున ఇన్‌డోర్, అవుట్ డోర్ గేమ్స్ నిర్వహించే విధంగా స్టేడియాలు శాప్‌తో కలిసి సిద్ధం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుండి 28 వరకు యోనెక్స్ సన్ రైస్ 87వ సీనియర్ జాతీయస్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ జరుగనుంది. 22, 23 అంతర రాష్ట్రాల టీమ్ ఛాంపియన్ షిప్, 24 నుండి 28 వరకు సింగిల్స్, డబుల్స్, మిక్సిడ్ డబల్స్ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం విజయవాడ పాలీ క్లినిక్ రోడ్‌లోని ఇంద్రప్రస్థా హోటల్లో టోర్నమెంట్ లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ ఎ.రవినాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ డా.పి.అంకమ్మ చౌదరి పాల్గొన్నారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నలుమూలలా జాతీయస్థాయి పోటీలు నిర్వహించాలనేదే సీఎం చంద్రబాబు కోరిక అని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర బ్యాడ్మింటన్ క్రీడాకారులు దేశంలోని ఇతర రాష్ట్ర బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఆదర్శమన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ క్రీడలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ తో పాటు అన్ని క్రీడలకు సహకారాన్ని అందిస్తామన్నారు. రాష్ట్రంలో నేషనల్ గేమ్స్ నిర్వహించటానికి కావాల్సిన అన్ని క్రీడా మౌలిక సౌకర్యాలు సిద్ధం చేస్తామన్నారు. ఏసీఏ తరుపున మంగళగిరి క్రికెట్ స్టేడియం తో పాటు, ఇంకొన్ని స్టేడియాల్లో అన్ని క్రీడలను ప్రోత్సహించే విధంగా బాడీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విజయవాడలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర రాజధానిలో క్రీడా వర్సిటీ, స్టేడియం ఏర్పాటు కానుందని తెలిపారు. అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో శాప్ చాలా చురుగ్గా పనిచేస్తోందని ప్రశంసించారు. క్రీడాకారులకు అందుబాటలోకి ఎక్కువ స్టేడియాలు తీసుకువచ్చేందుకు క షి చేస్తున్నట్లు తెలిపారు.. 2029 లో నేషనల్ గేమ్స్ రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న క షికి అనుగుణంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. ఇందిరా గాంధీ స్టేడియం ఆదునీకరణ పనులకు ప్లాన్ సిద్ధం అయిందని..త్వరలోనే సీఎం చంద్రబాబు కలిసి ప్లాన్ వివరాలు తెలియజేసి, పనులు యుద్ధప్రాతిపదికన మొదలు పెడతామన్నారు. జింఖానా, విద్యాధరపురం గ్రౌండ్స్ నేషనల్ గేమ్స్ కు అనుకూలంగా తయారు చేస్తామన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని, బ్యాడ్మింటన్ అభివ ద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందన్నారు. విజయవాడలో జాతీయస్థాయి పోటీలు నిర్వహించడం వలన యంగ్ టాలెంట్ వెలికితీయడానికి ఎంతో దోహదకరంగా ఉంటుందన్నారు. శాప్ ఛైర్మన్ ఏ.రవి నాయుడు మాట్లాడుతూ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తో మాట్లాడి ఆంధ్రప్రదేశ్ లో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో 3శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరుగుతుందని, డీఎస్సీలో క్రీడా కోటాలో 421 ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. తిరుపతిలో కిదాంబి శ్రీకాంత్ కు, విశాఖపట్నంలో సింధు, అమరావతిలో గోపీచంద్ కు అకాడమీ ఏర్పాటుకు స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి, శాప్ మాజీ ఛైర్మన్ డా.పి.అంకమ్మ చౌదరి మాట్లాడుతూ విజయవాడలోని చెన్ను పాటి రామకోటయ్య నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో జరుగనున్నాయన్నారు. ప్రభుత్వ సహకారంతో ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం జరుగుతుందని వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. అలాగే మీకోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు.



రావెళ్ల కృష్ణ సేవా సమితి సహాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన గంజాల శీను అనే నిరుపేద వికలాంగ కుటుంబానికి రావెళ్ల కృష్ణ సేవా సమితి చైర్మన్ రూ. పది వేల సాయాన్ని అందజేశారు. అంగవైకల్యంతో 15 సంవత్సరాల నుంచి పనులు చేసుకోలేని స్థితిలో ఉన్న శ్రీనుకు తల్లిదండ్రులు ఒకరి తరువాత మరొకరు అనారోగ్యంతో మరణించడంతో, అమాయకంగా ఉండే ఇద్దరు అక్కలు ఉన్నారు. కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న ఉదయ్ కుమార్ స్పందించి తన వంతు బాధ్యతగా రూ. పది వేల సాయాన్ని అందించారు. సేవా సమితి అధ్యక్షుడు డిసి చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్,నీటి సంఘం అధ్యక్షులు గొరిపర్తి సుబ్బారావు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు మోర్ల శివ, నేతలు జన్ను నాంచారయ్య,, ముమ్మనేని సన్నీ ఉన్నారు.

వంద రూపాయలకే రిజిస్ట్రేషన్ పట్ల హర్షం

ప్రజాశక్తి-కంకిపాడు : వంద రూపాయలకే వ్యవసాయ వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ జీవోను ప్రభుత్వం విడుదల చేయటంపట్ల దస్తావేజు లేఖరుల వత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల చిన్న సన్న కారు రైతులకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మార్కెట్ విలువ రూ.10 లక్షలలోపు ఉంటే కేవ లం వంద రూపాయలని, మార్కెట్ విలువ రూ.10 లక్ష లు మించినట్లయితే వెయ్యి రూపాయలు ఖర్చుతోందని తెలిపారు.

ఎపిఎన్‌జిఓస్ చల్లపల్లి నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-చల్లపల్లి : ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు చల్లపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం జరిగాయి. చల్లపల్లి యూనిట్ అధ్యక్షునిగా పివి.మాధవేంద్రరావు, సహాధ్యక్షునిగా పూసపాటి బ్రహ్మానందరావు, ఉపాధ్యక్షులుగా జివి రమణ, ఏం రాజకుమారి, వై. సాంసన్ బాబు, సహాయ కార్యదర్శిగా పిహెచ్ వి.ప్రసాద్ రావు, సహాయ కార్యదర్శులుగా జి. రాంబాబు, ఏ. శ్రీనివాసరావు, అబ్దుల్ వజిత్, వైస్. శివ నాగలక్ష్మి కోశాధికారిగా కె. రామ కోటేశ్వరావు ఎగ్జిట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా కె. రవిఅంకినీడు ప్రసాద్, పి. విష్ణు, సైకం. నాగలక్ష్మి, వై నాగలక్ష్మి వేమూరి లావణ్య ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిల్ సభ్యులుగా జి. వెంకటేశ్వర్లు ఓగిరాల నాగమల్లేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, కె. ద్రాక్షాయణి టి.శ్రీనివాసరావు లు ఎంపికయ్యారు. ఏపీ ఎన్జీవో కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకూరి శ్రీనివాసరావు ఎ. వెంకటేశ్వరరావు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డిపిఓ కార్యాలయం ఏవో వి. సీతారామయ్య పరిశీలకులుగా వ్యవహరించగా, అవనిగడ్డ యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులు బి రాజేంద్ర కుమార్ ఎన్నికల సహాయ అధికారిగా సిర్విశెట్టి సురేష్ కుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు పదవిలో ఉంటుంది. ఈ కార్యక్రమంలో యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షులు తోట సుధాకర్ రావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పామర్రు : స్థానిక యలమర్రు రోడ్డులోని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటిసంతకాల ప్రజాఉద్యమంలో భాగంగా ప్రజలు నుండి సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్,వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి,పామర్రు టౌన్ అధ్యక్షులు నందిపాటి సురేషరెడ్డి, ఉపసర్పంచ్ దేవిరెడ్డి బాలవేంకటేశ్వర రెడ్డి, నియోజకవర్గ వాణిజ్యవిభాగం అధ్యక్షులు నీలిశెట్టి శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజు,18వ వార్డు సభ్యురాలు నీలిశెట్టి పద్మిని తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు స్వీకరిస్తున్న దృశ్యం



పాలడుగుకు ఎంఎల్ఎ అభినందనలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ముదునూరు ప్రాథమిక వ్యవసాయ సహకారం సఘం మాజీ అధ్యక్షుడు పాలడుగుసత్యనారాయణను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభినందించారు. సంఘం నూతన అధ్యక్షుడిగా పాలడుగు పేరు ప్రతిపాదించడం పట్ల పలువురు టీడీపి నాయకులు ఎమ్మెల్యేను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అధ్యక్షుడుగా మరలా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పార్టీ మండల అధ్యక్షుడు కుటుంబరావు, మాజీ సర్పంచ్ జ్ఞానశేఖర్, నాగరాజు, రవితేజ, మహేశ్, చినఓగిరాల పీఏసీఎస్ అధ్యక్షుడు పాలడుగు రామకృష్ణ, సాయి, మహేశ్ ఇతర నాయకులతో కలసి సత్యనారాయణ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్క్రబ్ టైఫస్ ప్రబలకొండ గ్రామస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ సూచించారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో ఇద్దరికి స్క్రబ్ టైఫాస్ వ్యాధి నిర్ధారణ కావడంతో ఎండి ఇమ్రాన్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఏజెయల్ నరసింహారావు ఆధ్వర్యంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్ పర్యవేక్షణలో వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా గ్రామం అంతటా సున్నం, బ్లీచింగ్ చల్లించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, రాజా పర్యవేక్షించారు.



బ్లీచింగ్ చల్లిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మొవ్వ : గొట్టిపాటి సాయి ఫౌండేషన్(కూచిపూడి) ఆధ్వర్యంలో కూచిపూడి శ్రీ సీతా మహాలక్ష్మి ఫంక్షన్ హాల్ (జైహింద్ టాకీస్)లో ఆదివారం రూప ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రీప్లేస్మెంట్ హాస్పిటల్ (విజయవాడ) సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 525 మందికి పరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, కంటి పరీక్ష, వెన్నుముక పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్‌కు సిఫార్సు చేశారు. గొట్టిపాటి సాయి ఆధ్వర్యంలో కొనసాగిన ఈ శిబిరాన్ని గుడివాడ డి.ఎస్.పి ధీరజ్ వినీల్ ప్రారంభించగా పామర్రు సీఐ వి సుభాకర్, కూచిపూడి ఎస్సై పి శిరీష, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, వంగవీటి శంతన్ కుమార్, మొవ్వ మండల వైఎస్సార్సీపి అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, కూచిపూడి రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కొండవీటి అమరబాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మొవ్వ, ఘంటసాల, పమిడముక్కల మండలాల నుంచి రోగులు తరలివచ్చారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న డిఎస్‌పి

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

ప్రజాశక్తి-పెడన : పెడన మండలం పెనుమల్లి హరిజనవాడలో చనిపోయిన తండ్రికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన వల్లభు ఏడుకొండలు (56) అనారోగ్యంతో చనిపోయాడు. అతనికి కొడుకులు లేరు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చనిపోయిన తండ్రికి తాను తలకొరివి పెడతానంటూ మూడవ కుమార్తె కళ్యాణి ముందుకు వచ్చింది. పెద్దల సహాయంతో తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసింది. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా నగేష్ కూడా పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు : ఎస్ఐ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ చలనాలు తప్పవని ఎస్సై ఎన్వి.వి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ప్రధాన సెంటర్లో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, వ్యాన్లు, ఆటోలు డ్రైవ్ చేస్తున్న వారిని మద్యం సేవించారా లేదా అన్న నిర్ధారించే మిషన్ ద్వారా ఎస్సై తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ ను సక్రమంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఏఎస్ఐ బాల వెంకటేశ్వర రావు, సిబ్బంది ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - గుడివాడ : రౌడీ షీటర్లు మంచి ప్రవర్తనతో ఉండి రౌడీషీట్ తొలగించుకోవాలని రూరల్ ఎస్.ఐ చంటిబాబు అన్నారు. ఆదివారం స్థానిక తాలూకా పోలీసు స్టేషన్‌లో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.



ఇరిగేషన్ ఎఇ వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : జలవనరుల శాఖలో సుదీర్ఘకాలం ఏఈగా విధులు నిర్వహించిన పులిగడ్డ వెంకటేశ్వరరావు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన గత ఏడాది తీవ్ర అనారోగ్యానికి గురికాగా ప్రాణాపాయ స్థితిలో వైద్యశాలలో చేరి చికిత్స తీసుకున్నారు. అనంతరం సెలవుపై ఇంటి వద్దనే ఉంటూ కోరుకుంటున్న వెంకటేశ్వరరావు నాలుగు రోజుల క్రితం మరోసారి అనారోగ్యానికి గురై విజయవాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందారు. వారి స్వగ్రామం అవనిగడ్డ మండలం పులిగడ్డలో ఆయన భౌతికాయాన్ని ఉంచారు .

వెంకటేశ్వరరావుకు పలువురు నివాళి : అనారోగ్యంతో మృతి చెందిన ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు మృతి పట్ల అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రాం పులిగడ్డలో వెంకటేశ్వరరావు భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వర మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరీముల్లా వెంకటేశ్వరరావు, చల్లపల్లి సిపిఎం మండల కమిటీ సభ్యుడు కుంపటి బాబురావు భౌతికకాయాన్ని సందర్శించి పూలదండలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వెంకటేశ్వరరావు మతదేహంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వంరావు, గ్రామ సర్పంచ్ దాసరి విజయకుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు , కుమార్తె ఉన్నారు.

బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా పద్మ నియామకం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : బీసీ మహిళా సంఘ రాష్ట్ర అధ్యక్షురాలిగా గంగాపురం పద్మను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. నియామక పత్రాన్ని ఆదివారం కృష్ణయ్య చేతుల మీదుగా పద్మకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను పద్మతో పాటు చిరంజీవి క్రియేషన్స్ అధినేత చల్లపల్లి అమరప్రసాద్ దుశ్శాలువాలతో సన్మానించారు.



క్రీడలతో ఒత్తిడి దూరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జీవీజే జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో సోమవారం ఉదయం జరుగనున్న 14వ బాల చైతన్య స్ఫూర్తి క్రీడా ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మశ్రీ గెంటెల వెంకటరమణ (గురువు) స్ఫూర్తితో ప్రారంభమైన బాల చైతన్య స్ఫూర్తి క్రీడలు ఈసారి మరింత విస్తృతంగా, ఉత్సాహభరితంగా నిర్వహించనున్నామని తెలిపారు. క్రీడల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యం, పోటీ భావన పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రీడా ఉత్సవాల్లో పాల్గొని, పిల్లలకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, డీసీ కెనాల్ వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, పీడీ ఎం. శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.



అలరించిన కచేరీ

విజయవాడ : 'గాయక సార్వభౌమ, 'బ్రహ్మశ్రీ' పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 142వ జయంతి మహోత్సవం సందర్భంగా- ఆదివారం రాత్రి స్థానిక గాంధీనగర్ వి.హెచ్.గ్రంథాలయంలో జి.ఎస్.ఎస్. పరిషత్తు, 'స్వరఝరి' సంయుక్త నిర్వహణలో "సంగీత సాహిత్య సమాలంకతే" సోదాహరణ ప్రసంగ కచేరీ ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. ప్రముఖ విద్వాంసురాలు డాక్టర్ మల్లెల పద్మ (న్యూజిలాండ్) ఆలపించిన ఆయా కీర్తనలకు వయోలిన్‌పై లోళ్ల జయరాం, మదంగంపై రాయప్రోలు సుధాకర్ అత్యంత సానుకూలంగా సహకరించారు. ముఖ్య అతిథిగా సంగీత సన్మండలి ఉపాధ్యక్షులు జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగానే- ప్రముఖ మదంగ విద్వాన్ కొమ్మాజోశ్యుల సద్గురు చరణ్ కు "సునాద సుధానిధి" బిరుదు ప్రదానం జరిగింది. ప్రముఖ సంగీత విద్వాంసులు, "పద్మశ్రీ" అన్నవరపు రామస్వామి సన్మాన కర్తగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని 'స్వరఝరి' అధినేత మోదుమూడి సుధాకర్ నిర్వహించారు. ప్రవర్ధమాన యువ సంగీత కళాకారిణి లంక తేజస్వి తదితరులు సహకరించారు.

మున్సిపల్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీలోని 2 డివిజన్‌లో మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ పర్యటనలో ముత్యాల చెరువు, గీతమందిర్ రోడ్డు,



పాత కషవేణి థియేటర్ ఏరియా, ఏబిఎం పేట, రాజీవ్ నగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీలు, సిసి రోడ్లు సమస్య, కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు, మంచి నీటి పైప్ లైన్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి తక్షణమే చర్యలకు ప్రతిపాదనలు చేపట్టినందుకు అక్కడి స్థానికులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో లో చుట్టుకుదురు వాసు, కరిమి కొండ బాలాజీ, కొత్తపల్లి ప్రకాష్, రాగల జమలయ్య, రాగల నాని, నిమ్మల రాజు, చుక్కపల్లి చిన్నా, తొమ్మండ్రు డేవిడ్, చిలక రాజేష్, పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం : సిఐటియు



ప్రజాశక్తి-విజయవాడ : లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.సుధాకర్, కె.దుర్గారావు పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ కోపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం ఆదివారనం బి.ఆర్.టి.ఎస్ రోడ్డులోని నండూరి ప్రసాదరావు భవన్ సిఐటియు కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎం.వి.సుధాకర్, కె.దుర్గారావు పాల్గొని మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని, లేబర్ కోడ్ల వలన కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతారని తెలిపారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాడాలని పిలుపునిచ్చారు. సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు డిసెంబర్ 31 నుండి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్నాయని, 4న జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కె.దుర్గారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.శ్రీనివాస్, ఎస్.కె.కరీం, కోశాధికారిగా డి.రాజు, ఉపాధ్యక్షులు వి.రామ్మోహన్ రావు, వి.ఎన్.వి సాయిరాం, సహాయ కార్యదర్శులుగా పి.విజయ్ కుమార్, ఎన్‌సిహెచ్ పాపారావులతో పాటు ఇంకొక ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-విజయవాడ: రూరల్ జోన్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు డిసిపిలు కృష్ణకాంత్ పటేల్, బి.లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్‌పి హై స్కూల్లో రూరల్ పరిధిలోని రౌడీషీటర్‌లకు, సస్పెక్ట్‌లకు రూరల్ డిసిపి. బి.లక్ష్మీనారాయణ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి అసాంఘిక కార్యక్రామాలలో పాల్గోవడం చేయరాదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జగన్‌కు మతిభ్రమించింది

బుద్దా వెంకన్న

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తిరుమల తిరుపతి దేవస్థానం పరకామణి కేసు వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించిన తీరును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తప్పు పట్టారు. ఆదివారం సాయంత్రం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేసిన జగన్ లాంటి వ్యక్తికి పరకామణి కేసు చిన్నదేనంటూ ఎద్దేవా చేశారు. లక్షలాది యాత్రికుల మనోభావాలకు సంబంధించిన పరకామణి కేసు విషయంలో జగన్ మతి భ్రమించి మాట్లాడుతున్నట్లు ఉన్నారన్నారు. పరకామణి కేసులో ముద్దాయి రవికుమార్ సాక్షాత్తు తన తప్పును ఒప్పుకున్నాడన్న సంగతి జగన్‌కి తెలియదా? అని నిలదీశారు. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన సిట్ విచారణలో అన్ని వెలుగులోకి వస్తాయన్నారు. ఇప్పటికే ఈ కేసులో ఒక ముద్దాయి హత్యకు గురయ్యాడని, రేపటి రోజున రవికుమార్ కూడా హత్యకు గావించబడొచ్చని సందేహం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు, లోకేష్ పై వ్యంగంగా మాట్లాడుతున్న వైసీపీ నేత పేర్ని నాని, తన నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరిస్తున్నామన్నారు.

మెనోపాజ్‌పై మహిళలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : మెనోపాజ్ దశలో మహిళలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, ఆధునిక చికిత్సా విధానాలు, వైద్య పరిశోధనల పురోగతి తదితర అంశాలపై వైద్యులకు అవగాహన కల్పించేందుకు విజయవాడ మెనోపాజ్ సొసైటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. నగరంలోని జీఆర్టీ గ్రాండ్ హోటల్లో ఆదివారం నిర్వహించిన ఈ సదస్సులో 'ప్రోలాప్స్ రీడిఫైన్డ్' అనే అంశంపై ప్రసంగించిన డాక్టర్ అనురాధ కోడూరి.. తన తాజా నవల 'మై బాలీవుడ్ రొమాన్స్'ను ఆవిష్కరించారు. పారు అనే మహిళ ప్రధాన పాత్రగా రూపుదిద్దుకున్న ఈ నవలలో స్త్రీ జీవితానికి సంబంధించిన అనేక సున్నితమైన అంశాలను రచయిత్రి హృద్యంగా ఆవిష్కరించారు. ప్రతిభావంతురాలైన వైద్యురాలిగా ఖ్యాతి గడించిన డాక్టర్ అనురాధ కోడూరి.. నవలా రచయిత్రిగానూ ప్రత్యేకతన చాటుకుంటున్నారు. సదస్సు ప్రారంభోత్సవంలో సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ హరిత పిన్నమనేని మాట్లాడుతూ.. మెనోపాజ్‌పై స్త్రీలకు విస్తత అవగాహన కల్పించాలని అన్నారు. ఆధునిక వైద్య చికిత్సలు, మానసిక సంసిద్ధతతో మెనోపాజ్ సంబంధిత సమస్యలను అధిగమించొచ్చని ఆమె పేర్కొన్నారు. మెనోపాజ్ సంబంధిత చికిత్సల్లో నూతన పద్ధతులు, హార్మోన్ థెరపీ మార్గదర్శకాలు, రిస్క్ ఫ్యాక్టర్లు, వ్యక్తిగత చికిత్సా విధానంపై తాజా అధ్యయనాలను వైద్యులకు పరిచయం చేయడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యమని తెలిపారు. సొసైటీ సెక్రటరీ డాక్టర్ మైనేని పూజిత



మాట్లాడుతూ.. మెనోపాజ్ సమయంలో వచ్చే సైకాలజికల్ లక్షణాలు, డిప్రెషన్, ఆంగ్జైటీ, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలను గుర్తించే విధానం, ఆధునిక మేనేజ్‌మెంట్‌పై వైద్యులు మరింత దృష్టి పెట్టాలని సూచించారు. విజయవాడ మెనోపాజ్ సొసైటీ ట్రెజరర్ డాక్టర్ భీమవరపు నవీన మాట్లాడుతూ.. మెనోపాజ్ తర్వాత మహిళల్లో పెరుగుతున్న ఆస్టియోపోరోసిస్, హృదయ సంబంధిత వ్యాధులు, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యలను ముందుగానే గుర్తించి, నిరోధక చర్యలు తీసుకోవడం కోసం తాజా గైడ్‌లైన్స్‌ను ఈ కాన్ఫరెన్స్‌లో చర్చిస్తున్నట్టు చెప్పారు. ఈ సదస్సుకు లబ్బీపేటలోని ప్రశాంత్ అడ్వాన్స్డ్ యురాలజీ, గైనకాలజీ అండ్ రోబోటిక్ సర్జరీ హాస్పిటల్‌లో సెక్రటేరియట్ ఏర్పాటు చేశారు. విజయవాడ అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన ఈ సదస్సుకు డాక్టర్ ఆర్ఎస్ రమాదేవి, డాక్టర్ వి.పద్మజ, డాక్టర్ పి.సుశీల పాట్రన్లుగా వ్యవహరించారు.

గోల్డెన్ ఈకో డ్రై ప్రొడక్ట్ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ రూరల్ నైనవరం గ్రామం గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో గోల్డెన్ ఈకో డ్రై ప్రోడక్ట్ యూనిట్ నూతనంగా ప్రారంభమైంది. ఆదివారం సంస్థ కార్యాలయాన్ని చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ లాంఛనంగా ప్రారంభించారు. యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ సీఈఓ బండి కాళేశ్వరరావు



మీడియాతో మాట్లాడుతూ.. తమ ఉత్పత్తులలో హానికారక రసాయనిక పదార్థాలను వాడకుండా పూర్తిగా ఆర్గానిక్‌గా విధానంలో తయారు చేయడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మానవునికి ప్రకృతి ప్రసాదించిన ఔషధ గుణాలు కలిగిన నల్లేరు, మునగ, మునక్కాయ పొడులు, డ్రై క్యారెట్, బీట్రూట్, వెల్లుల్లి పొడులు వంటి అన్ని రకాల పండ్లు, కూరగాయలు, ఔషధ గుణాలు కలిగిన తెలుసు అమ్మ ఆకుల పొడులను తయారు చేయనున్నట్లు వివరించారు. నాణ్యత గల ప్రొడక్ట్‌ను ప్రజలకు అందించడం, వారిని ఆరోగ్యంగా ఉంచడం, తక్కువ ధరకే ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకురావడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అదే విధంగా నైనవారం ప్రాంతంలో సుమారు 50 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. తాము ఉత్పత్తి చేసే ప్రతిదీ హైజెనిక్‌గా, స్వచ్ఛతతో కూడుకుని ఉంటుందని, ఇందులో ఒక్క శాతం కెమికల్‌గాని, ఇతర పౌడర్‌లు గాని మిక్స్ చేసినట్లు నిరూపితమైతే లక్ష రూపాయలు నగదు ఇస్తామని బండి కాళేశ్వర్ సవాల్ విసిరారు. కంపెనీ ప్రొప్రైటర్ ఎం.గిరి వర్ధన్ మాట్లాడుతూ తమ గోల్డెన్ ఈకో ప్రొడక్ట్స్ కంపెనీ మొత్తం ఆర్గానిక్‌గా చేయాలనే మోటివ్‌తో ప్రారంభించబడిందని, ప్రతి ప్రొడక్ట్ ఊరి నుంచి తెస్తామని, ఒక్క చుక్క కూడా కెమికల్ లేకుండా మ్యానుఫ్యాక్చర్ చేస్తామని తెలిపారు. ప్యాకేజింగ్ కూడా కెమికల్స్ లేకుండా, ప్యూర్ గ్లాస్‌తో ప్యాక్ చేస్తామన్నారు. మార్కెట్‌లో అందరూ కెమికల్స్ ఎక్కువ వాడుతున్న నేపథ్యంలో, తాము కంప్లీట్ ఆర్గానిక్‌గా వెళ్తామన్నారు. తమ వద్ద గరం మసాలాల నుంచి కారపు పొడులు, పచ్చడ్లు హెయిర్‌కు సంబంధించిన ప్రొడక్ట్స్, షుగర్‌కి సంబంధించిన మెడిసిన్ వంటి అనేక రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నైనవరం వైస్ ప్రెసిడెంట్ దావూ జోసెఫ్, స్థానికులు సొంటి సత్యనారాయణ, తాళ్లూరు గోపి, బి అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్ ఆధ్వర్యంలో 'అలర్జీ 360'పై సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : అలర్జీ, ఆస్తమా, ఎయిర్‌వే సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ, ఐఎంఎ విజయవాడ సంయుక్తంగా "అలర్జీ 360' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన ఈఎన్‌టి శస్త్రచికిత్స నిపుణులు, పల్మనాలజిస్టులు, పీడియాట్రిషన్స్, అలర్జిస్టులు, జనరల్ ప్రాక్టిషనర్స్‌తో సహా 300కిపైగా వైద్యులు హాజరయ్యారు. తాజ్ వివాంటాలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మణిపాల్ హాస్పిటల్ ఆపరేషన్ థియేటర్ నుండి ప్రత్యక్ష శస్త్రచికిత్సలను ప్రసారం చేశారు. వీటిలో కోబ్లేషన్ అడెనోటాన్సిలెక్టమీ, ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ, యూస్టేసియన్ ట్యూబ్ బెలూన్ డైలేషన్ వంటి శస్త్రచికిత్సలు ఉన్నాయి. వీటిని నెక్ సర్జన్ డాక్టర్ సందీప్ నిర్వహించారు. సైంటిఫిక్ సెషన్లలో అలర్జిక్ రైనైటిస్, స్కిన్ ప్రిక్ టెస్ట్, పీడియాట్రిక్ ఆస్తమా, ఆస్తమా ఫీనోటైపింగ్, ఇమ్యునోథెరపీ, ఇమ్యునోక్యాప్ ఆధారిత ఖచ్చితమైన అలర్జీ డయగ్నోసిస్ వంటి అంశాలు గురించి చర్చించారు. డాక్టర్ లోకేశ్ గుప్టా, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, టైప్ 2 సివియర్ ఆస్తమా, ఐఎల్-5 ఆధారిత బయోలాజిక్స్‌పై ప్రసంగించారు. డాక్టర్ జి. ఉదయ్ కిరణ్, కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్, అడ్వాన్స్డ్ లంగ్ ఫంక్షన్ అసెస్మెంట్, ఫంగల్ అలర్జీలు, ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ పద్ధతులపై వివరణాత్మకంగా మాట్లాడారు. డాక్టర్ లోకేశ్ మాట్లాడుతూ "అలర్జీ, ఆస్తమా పిల్లలు, పెద్దలు రెండింటినీ ప్రభావితం చేస్తూ తరచూ ఇన్‌ఫెక్షన్లు, ఆసుపత్రి చేరికలకు దారితీస్తున్నాయి. ఖచ్చితమైన డయగ్నోసిస్, సమర్థమైన చికిత్సా విధానాలు, సివియర్ ఆస్తమా కోసం నూతన బయోలాజిక్స్ ప్రాధాన్యంపై. ప్రసంగించారు. ముందస్తు గుర్తింపు రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకం" అని పేర్కొన్నారు.



నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

ఆకట్టుకున్న 'అభినయ' నాటకం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మహతి కళావేదికలో భావతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో భవిష్య రచించిన 'అభినయ' సాంఘిక నాటక పుస్తకావిష్కరణ ఆదివారం ఘనంగా నిర్వహించారు.ప్రపంచ తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు, సాహిత్య వేత్త డాక్టర్ ధన్వంతరి ఆచార్య, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భావతరంగిణి గౌరవాధ్యక్షులు కె. కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.ఆవిష్కరణ అనంతరం ప్రేక్షకులే సమీక్షకులు అని రచయిత ప్రకటించి అభినయ నాటక ప్రదర్శన నిర్వహించి వినూత్నమైన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ప్రముఖ సాహితీవేత్త శ్రీ కొప్పరపు నారాయణ మూర్తి, చార్టర్డ్ అకౌంటెంట్ బి.వి.వి.సత్యనారాయణ, రచయిత్రి గుడిపూడి రాధికారాణి, తెలుగు భాషా సమాఖ్య కార్యదర్శి అప్పినేడి పోతురాజు, ఆర్టీసీ డి.ఎం.పెద్దిరాజు,ప్రముఖ గాయని కాళీపట్నపు ఉమ,కవయిత్రి మాదిరాజు శివలక్ష్మి తదితరులు అభినయను వీక్షించి సమీక్షించారు. సాహితీ ప్రియులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శించిన అభినయ సాంఘిక నాటకం పలు ప్రత్యేకతలతో ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.



నాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు - (గన్నవరం) : నాటక రంగాన్ని అభివద్ధి చేయాలని గన్నవరం నాట్యకళా మండలి ఆర్గనైజర్ బత్తుల శివయ్య, కొడాలి ఇశ్రాయేలు అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా భాషా సాంస్కృతి సౌజన్యంతో కళామ్మ తల్లి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 4వ తేదీ నుండి 6 వతేది రాత్రి వరకు గన్నవరం లోని దళితవడలో నాటక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ సందర్భంగా శివయ్య, ఇశ్రాయేలు మాట్లాడుతూ నాటక రంగంను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో టెక్నాలజీ మారిపోయిందని, ఫోన్లు, సినిమాలతో యువత కొనసాగుతున్న తరుణంలో నాటక రంగంలో ఆధారపడి ఉన్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే విధంగా నాటక రంగంలో నమ్ముకున్న వారిని ఆదుకోవాలని కోరారు.

కృష్ణాలో 2,46,473 టన్నుల ధాన్యం సేకరణ : జెసి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఖరీఫ్ 2025-26 సీజనుకుగాను కృష్ణా జిల్లాలో ఇప్పటివరకు 2,46,473 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 287 రైతు సేవ కేంద్రాల ద్వారా 29,668 మంది రైతుల వద్ద నుండి ఈ ధాన్యం సేకరించామన్నారు. ఇందుకుగాను రైతుల ఖాతాల్లో 502.50 కోట్ల రూపాయలు రైతల బ్యాంక్ ఖాతాలో నేరుగా జమ చేశామన్నారు. గత సంవత్సరం ఈ రోజుకి 1,82,405 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయగా ఈ సంవత్సరం 2,46,473 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. అలాగే రైతుల వద్ద నుండి ధాన్యం సేకరణ చేసేందుకు 72,98,622 గోనె సంచులు జిల్లాలోని రైతు సేవ కేంద్ర ముల వద్ద రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 4,199 వాహనాలను అందుబాటులో ఉంచామన్నారు. అదే విధంగా రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయుటకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి వారితో నిరంతరం సమీక్షలు నిర్వహించడంతో పాటుగా క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్య టించి ధాన్యం సేకరణలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ ఖరీఫ్ సీజనులో కనీస మద్దతు ధర ప్రతి క్వింటాల్ ధాన్యం సాధారణ రకం రూ.2,369చొప్పున, గ్రేడ్-ఏ రకానికి రూ.2,389 చొప్పున ప్రతి రైతునకు చెల్లించామన్నారు. అలాగే జిల్లాలోని రైతులకు ధాన్యం విక్రయించుటలో ఎటువంటి సలహాలు, ఫిర్యాదుల కొరకు రైతు సేవ కేంద్రాల వద్ద సిబ్బందిని, మండల డివిజన్ స్థాయి అధికారులను సంప్రదించాలని, వారి వద్ద సమస్య పరిష్కారం కాని యెడల జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ ను 8247693551 సంప్రదించాలన్నారు.

ముదునూరులో ఇంటింటి సర్వే



ఇంటింట సర్వే నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి-ఉయ్యూరు : ముదునూరులో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఇంటింట సర్వే నిర్వహించి జ్వరం, ఇతర వ్యాధులు, అనారోగ్యంతో ఉన్నవారిని గుర్తించారు. గ్రామంలో స్క్రబ్ టైఫస్ బారిన పడి ఒకరు ఈనెల 4న మృతిచెండదం కలకల రేపింది. దీంతో జిల్లా వైద్యాధికారి పి.యుగంధర్ శనివారం గ్రామంలో పర్యటించి మతుని కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకుని, ఇతరులను ఆరాతీసి, మరెవరైనా జర్వం, ఇతర లక్షణాలతో బాధపడుతున్నవారి గురించి గ్రామంలో ఇంటిం ట సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమేరకు సిబ్బంది ఆదివారం 700 గృహాలు సర్వేచేసి, జ్వరాలతో బాధ పడేవారు ఉన్నారా అని ఆరాతీసి వివరాలు సేకరించారు. కేవలం నలుగురు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్టు తేలిందని కాటూరు పిహెచ్సీ వైద్య అధికారి ఎస్. శివరామకృష్ణ తెలిపారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

వడ్రంగి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : జగన్నాధపురం జగన్నాథ స్వామి దేవాలయంలో మచిలీపట్నం వడ్రంగి పనివారల నూతన సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. వడ్రంగి పనివారల సంఘం గౌరవ సలహాదారులు గడ్డంరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సంఘం అధ్యక్షులుగా కొరగంటి కాంతా రావు, ప్రధాన కార్యదర్శిగా పరసా లక్ష్మీనారా యణలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులచే సంఘ నిబంధన మేరకు ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభివద్ధికి కషి చేయాలని, 500 మంది సభ్యులు కలిగిన మచిలీపట్నం వడ్రంగి పని వారల సంఘం ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని, మచిలీపట్నంలో వడ్రంగి పనివారల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా అర్హులైన వడ్రంగి పని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షులు కాంతారావు మాట్లాడుతూ వడ్రంగి పనివారల సంక్షేమ భవన్‌కు స్థలం కేటాయించాలని, వడ్రంగి పనివాళ్ల కొరకు ప్రభుత్వం నుండి సబ్సిడీ రుణాలు అందించి ఆధునిక పరికరాల కొనుగోలుకు సహకారం అందించాలని తెలిపారు.



కెసిపి విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-ఉయ్యూరు : దీర్ఘకాలం పాటు కలసి పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం ఎక్కడ్కెడో స్థిరపడి అందరూ కలసి గతస్మతులు గుర్తుచేసుకుని, సత్కరించి గౌరవించడం అభినందనీయమని ప్రముఖ సీనియర్ వైద్యుడు శివరామకృష్ణయ్య అన్నారు. కేసీపీ చక్కెర కర్మాగారంలో వ్యవసాయ విభాగంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురు ఆదివారం కలసుకుని అత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమానికి శివరామకృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని 75 సంవత్సరాలు నిండిన ప్రబాకర్రావు, ఆంథోని, సు బ్రమణ్యేశ్వరరావు, శ్రీరామకృష్ణ, వెంకటేశ్వరరావు, ప్రతాప్రోవు, సత్యనారాయణలను ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మేరుగ సత్యనారాయణ, వీర కోటేశ్వ రరావు, వెంకటేశ్వరరావు, రాంబాబురెడ్డి, కోడె సాంబశివరావు, సూర్యనారాయణ, కృష్ణమోహనరావు తదితర సభ్యులు సేవలందించారు.

కొండలమ్మ దేవస్థానంలో యాత్రికుల రద్దీ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. అమ్మవారిని సుమారు 10వేల మంది యాత్రికులు దర్శించుకోగా అత్యధిక స్థాయిలో యాత్రికులు అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానికి విచ్చేసిన యాత్రికులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకొనుటకు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

9వ తేదీన హుండీల లెక్కింపు : కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో యాత్రికులు హుండీలలో సమర్పించిన కానుకలు లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 9 తేదీ మంగళవారం నిర్వహిసున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు శనివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుండి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన్ రావు, సభ్యులు, డిపార్టుమెంటు అధికారులు, గ్రామస్తులు, సేవకులు సిబ్బంది సమక్షములో ఆలయ మండపంలో లెక్కింపు కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యాత్రికులు లెక్కింపులో పాల్గొనాలని ఈవో కోరారు.



మండలికి సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని శ్రీలంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ అన్నపురెడ్డి. వెంకటస్వామి, శ్రీ రాజశేఖర్‌స్వామి (శివాలయం) చైర్మన్ ఘంటసాల రాజమోహన్రావు (కన్నయ్య) నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్‌ను కలసి సత్కరించారు. ఆదివారం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్దకు వెళ్లి ఆయన తనయుడు వెంకట్రామ్‌ను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముళ్ళపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో మెరుగైన ఆరోగ్యం

- 283 మందికి ఉచిత వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నేటి ఉరుకుల పరుగుల సమాజంలో మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండడం వల్ల మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని ప్రముఖ నరాల వ్యాధి నిపుణులు డాక్టర్ గోపాలం శివన్నారాయణ పేర్కొన్నారు. ఆదివారం మచిలీపట్నం బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో పెనుబోతు వెంకటేశ్వరరావు స్మారక రెగ్యులర్ మెడికల్ క్యాంపులో వందలాది మంది రోగులు, వైద్య సేవల కోసం పాల్గొన్నారు. వారిని ఉద్దేశించి డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ మానసిక బలం, శారీరక వ్యాయామం, క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లు కలిగిన వ్యక్తు లను ఏ అనారోగ్యం పీడించలేదని హితవు పలికారు. ప్రజల ఆలోచన ధోరణిలో విపరీతమైన మార్పులు, భిన్నమైన జీవనశైలి, అర్ధరాత్రి స్ట్రీట్ ఫుడ్ తినడం తదితర చర్యల వల్ల హాస్పిటలకు క్యూ కట్టే రోగుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. 283 మంది రోగులు రోగులు ఈ శిబిరానికి హాజరై వైద్యులకు చూపించుకుని రెండు నెలలకు సరిపడా మందులు తీసుకెళ్లినట్లు ఆరోగ్య శిబిరం కన్వీనర్ పామర్తి నాగయ్య తెలియజేశారు. డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్, డాక్టర్ పి.సురేష్ చంద్రారెడ్డి, డాక్టర్ కుప్పా రామ శాస్త్రి పాల్గొని వైద్య సేవలందించారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-వీరులపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు వ్యతిరేకంగా చేపడుతున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం చేసుకునేందుకు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణకు కార్మికులను, ఉద్యోగులను ఐక్యం చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. ఆదివారం వీరులపాడు మండలంలోని జుజ్జూరు, అల్లూరు, పెద్దాపురం, జయంతి, దొడ్డ దేవరపాడు, వీర్లపాడు గ్రామాల్లో అఖిల భారత మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వీరులపాడు మండల కార్యదర్శి లాల్ అహ్మద్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి చాట్ల రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు జాన్ సైదా, మహిళా నాయకురాలు చాంద్ బేగం, రైతు సంఘం నాయకులు పల్లెకంటి బాబు, హెచ్.అశోక్, పల్లెకంటి విల్సన్, భవన నిర్మాణ కార్మికులు, ధాన్యం ముఠా కార్మికులు పాల్గొన్నారు



డస్ట్ బిన్లు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం :రెడ్డిగూడెం గ్రామంలో చెత్త సేకరణలో భాగంగా శనివారం ఇంటింటికి డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు పి కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మనం పరిశుభ్రంగా ఉంటేనే మన పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలుగుతామని తెలిపారు. గ్రామంలో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డస్ట్ బిన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్డిగూడెం సర్పంచ్ రాణి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సగ్గుర్తి రామారావు, ఉప సర్పంచ్ కొండపల్లి బాబు, పాల్గొన్నారు.

టిడిపి వన సమారాధన

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నున్న వికాస్ కాలేజీ రోడ్డులో ఉన్న ఆయుర్వాన్ రిసార్ట్స్‌లో టిడిపి సెంట్రల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల వన సమారాధన కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. సాంప్రదాయ పద్ధతిలో, అన్ని రకాలైన వంటకాలతో సందడిగా సాగింది. సత్యా మ్యూజికల్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యలంఓ గీతాలు ఆలపించారు. ముఖ్య అతిథులుగా విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్, నూర్ బాష రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో స్వచ్ఛ భారత్

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండలంలోని శివాపురం గ్రామంలో బాపట్ల లోని వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వ హించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుండి వాటర్ ట్యాంక్ వరకు ముళ్ళకంపలు, కలుపుమొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, వ్యవసాయ కళాశాల ఆచార్యులు, పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు



ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలం కంభంపాడు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు కుంచపు మంగయ్య, కుంచపు భారతమ్మ, పెనుగొండ నాగమణి, బెజ్జం లూర్దు, బూరగ సంగీతరావు తదితర నాలుగు కుటుంబాలు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సమక్షంలో టిడిపిలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కంభంపాడు నీటిసంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ చావా శాంతిబాబు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉయ్యూరి అప్పారావు, జగ్గయ్యపేట పట్టణ 29వ వార్డ్ కౌన్సిలర్ కంచేటి గీతారాణి, రామిశెట్టి ఉమామహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడిన హెల్మెట్



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి బి కాలనీ వద్ద కొండపల్లి నుండి విజయవాడ వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఆదివారం ప్రమాదం జరిగింది. అయితే, ప్రమాద సమయంలో ఇద్దరూ హెల్మెట్ ధరించి ఉండటం వలన తలకు తీవ్ర గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ ధరించిన ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం తప్పించుకున్నారు. ఈ సంఘటనపై ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు ఇబ్రహింపట్నంలో హెల్మెట్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ మస్ట్ అంటూ కఠినంగా నిబంధనలు అమలు చేస్తున్నారని తెలియజేశారు. హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు.

గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి బ్రహ్మం మృతి



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణానికి చెందిన కంచికచర్ల గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి వరదబోయిన బ్రహ్మం (48) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. బ్రహ్మంకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కంచికచర్ల, గొల్లపూడి, తాడిగడప, మూలపాడు, పోరంకి, పలు మేజర్ పంచాయతీలకు కార్యదర్శిగా ప్రజలకు సేవలందించారు. శనివారం నందిగామలో అంత్యక్రియలు నిర్వహించారు. బ్రహ్మం మృతి పట్ల స్థానికులు, బంధుమిత్రులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

సైనిక సంక్షేమానికి విరాళాలు



ప్రజాశక్తి-నందిగామ : సైనిక సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వడం సామాజిక బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య తెలిపారు. ఆదివారం నందిగామ కాకాని నగర్ కార్యాలయంలో మాజీ సైనికులు, వారి పిల్లల సంక్షేమానికి ఏర్పాటు చేసిన నిధికి విరాళాలు సేకరించే సదుద్దేశంతో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఏటా డిసెంబర్ 7న నిర్వహిస్తారని తెలిపారు. యుద్ధంలో గాయపడిన, మరణించిన సైనికులకు వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండడం మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విరాళాలు సేకరిస్తున్న సైనికులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వాసిరెడ్డి ప్రసాద్, విశ్రాంత సైనికులు, పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి - రెడ్డిగూడెం

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రెడ్డిగూడెం మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివాంర నిర్వ హించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.భవాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యుటిఎఫ్ రెడ్డిగూడెం మండల అధ్యక్షులుగా బి.వి.ఎస్.నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డి.ప్రకాష్, ఉపాధ్యక్షులుగా డి.సర్దార్ నాయక్, ఉపాధ్యక్షురాలుగా డి.విజయలక్ష్మి, కోశాధికారిగా కట్టా విజయ్ కుమార్, ఆడిటర్‌గా అలవాల బిక్షాలు, కార్యదర్శులుగా డి.శైలశ్రీ, ఎస్.కె.హసీనా, డి.రాంబాబు, ఫణి కుమార్, సతీష్ ప్రసన్న, జిల్లా కార్యవర్గ సభ్యులుగా కె.శంకర్రావు, పి.కస్తూరి లలిత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలవాల సుందరయ్య, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి.సూర్యనారాయణ వ్యవహరించారు. అనంతరం సుందరయ్య మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, పిఆర్‌సి కమిటీ వేయాలని, మధ్యంతర భృతి 29 శాతం ప్రకటించాలని, పెండింగ్ డిఎలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని విద్యా నగర్‌లో గల కృష్ణా వికాస్ మహిళా సంక్షేమ సంఘం వృద్ధాశ్రమంలో ఆదివారం ఉగ్గు అనిల్ కుమార్, ఉషారాణి కుమార్తె ఉగ్గు జెస్సిక జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వ హించారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం అధ్యక్షురాలు కె.సుమదర్శిని మాట్లాడుతూ ఆశ్రమంలో వృద్ధులకు పుట్టిన రోజు సందర్భంగా భోజనం ఏర్పాటు చేసిన ఉగ్గు అనిల్ కుమార్, ఉషారాణికు అభినందనలు తెలిపారు.

చిల్లకల్లు-2 ఎస్ఐగా సాయి మణికంఠ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: చిల్లకల్లు ట్రైనీ ఎస్ఐగా వచ్చిన సాయి మణికంఠ ఆదివారం చిల్లకల్లు- 2 ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

టిడిపి నేత శ్రీనివాసరావు మృతి



ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల టిడిపి సీనియర్ నాయకులు, రాష్ట్ర ఎన్‌టిఆర్ అభిమాన సంఘం నాయకులు, సినీ నటులు నిమ్మగడ్డ శ్రీనివాసరావు (75) హైదరాబాదు ప్రగతి నగర్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాసరావు గతంలో టిడిపి మండల అధ్యక్షుడిగా సేవలందించారు. కాగా ఆయన మృతి పట్ల మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు తొండపు దశరథ జనార్ధన, మాజీ ఎంపీపీ వేగనీటి గోపాలకృష్ణ మూర్తి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు, సహకార సంఘం మాజీ అధ్యక్షులు రఘురామయ్య సంతాపం తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-వత్సవాయి : అనుమానాస్పద స్థితిలో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెనుగంచిప్రోలులోని మునిటి లంకలో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునిటి లంకలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు జగ్గయ్యపేట మండలంలోని గుండబోయినపాలెంకు చెందిన గాలం మల్లి కార్జునరావుగా గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఎంఎల్ఎ బోడేప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

డిఎస్‌సి ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం కానూరులో ప్రతిభ కోచింగ్ సెంటర్లో డిఎస్‌సి-2025లో ఉద్యోగాలు సాధించిన వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ మాట్లాడుతూ తమ కోచింగ్ సెంటర్ నుంచి 358 మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గొట్టిముక్కల రఘు రామరాజు, స్వచ్ఛంధ్రా కార్పొరేషన్ ఛైర్మన్ . కొమ్మారెడ్డి పట్టాభిరాం, గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురు మూర్తి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



జలధీశ్వరుని సేవలో ఎంఎల్ఎ కుటుంబం

ప్రజాశక్తి-ఘంటసాల : జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ తాతయ్య కుటుంబ సభ్యులు ఘంటసాలలోని శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామివారిని దర్శించు కున్నారు. ఆదివారం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే సతీమణి శ్రీదేవి, కుమారుడు కృష్ణపవన్, శ్రీదేవి తల్లిదండ్రులు చింతా వెంకట జనార్ధనరావు, విశాలాక్షి దంపతులు ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కృష్ణాజిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలను బహూకరించి, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

రాములుకు సత్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : కవి డా. సి.నారాయణరెడ్డి అలాపీఠం వ్యవస్థాపకులు మళ్ళికేడి. రాములను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకోట మండలం, రాచపల్లికి చెందిన రాములు ఆదివారం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాదును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఉమ్మడి రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కలిగిన పరిచయంతో రాములు అవనిగడ్డ వచ్చి ఎమ్మెల్యేను కలసి గత స్మృతులు పంచుకున్నారు. ఈ సందర్భంగా రాములును బుద్ధప్రసాద్ ఆత్మీయ పూర్వకంగా సత్కరించారు.



మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం కొత్తమాజేరులో ఆదివారం గ్రామ ప్రముఖులు తుమ్మల తాతయ్యను అవనిగడ్డ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. తుమ్మల తాతయ్య సతీమణి ఝాన్సీ ఇటీవల మృతిచెందగా, ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఝాన్సీ మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కూటమి నాయకులు నివాళులు అర్పించారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** మండలంలోని నాగాయితిప్ప గ్రామనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా ఆదివారం వెంకట్రామయ్య స్వగహం వద్ద అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసినివాళులు అర్పించారు. వెంకటరామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పిఎసిఎస్ చైర్ పర్సన్ బల్ల సీతారామప్రసాద్, మాజీ సర్పంచ్ వేములపల్లి రవిచంద్ర, ఏఎంసి డైరెక్టర్ పుపాల యేసు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామయ్య మృతికి సంతాపం

వెంకట్రామయ్య మతి పట్ల సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయణరావు సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చిన్నతనం నుండి కమ్యూనిస్టు భావాలకు దగ్గరగా ఉండే వెంకట్రామయ్య తర్వాత తెలుగుదేశం పార్టీ గ్రామ ప్రముఖులుగా పేరుగాంచారన్నారు. రైతు ఉద్యమాలకు, కార్యక్రమాలకు చేదోడుగా కలిసి వచ్చేవారిని పేర్కొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** 'గీతా మాత'గా సుప్రసిద్ధులైన ప్రముఖ సంఘ సేవకురాలు గుత్తికొండ కోకిలాంబను అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదివారం పరామర్శించారు. ఘంటసాల మండలం చిన్నకళ్లేపల్లిలోని కోకిలాంబ స్వగహానికి వెళ్ళిన ఎమ్మెల్యే, ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వయోభారంతో ఇంటికే పరిమితమైన ఆమె ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరి బాబు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, ఇతర నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


మోపిదేవి మండలంలో మృతుడి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ మండలి


మాట్లాడుతున్నటి. హనుమంతరావు

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -నందివాడ : సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేస్తామని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 36ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెన్నెన్నపూడి గ్రామంలో సహకార సంఘ భవనంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏపిపిఏసిఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్. టి. హనుమంతరావు మాట్లాడుతూ జనవరి 5 వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. 8వ తేదీన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డీ. సిసిబి బ్రాంచీల ఎదుట ధర్నా, 16న జిల్లా సహకార కార్యాలయల వద్ద ధర్నా, 22న డీ సి సి బి ప్రధాన కార్యలయాల వద్ద ధర్నాలు, 29న రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగులతో విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అప్పటికే సమస్యలు పరిష్కారం కాకపోతే జనవరి 5 నుంచి నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. సహకార సంఘ ఉద్యోగులు, సంఘ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మికి సత్కారం

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని తాడంకి గ్రామ కార్యదర్శి భవాని పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవో అయినందుకు ఆమెకు తాడంకి గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారని కొనియాడారు. అనంతరం ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ కార్యదర్శి తాళ్లూరు వెంకటరమణ, జంపాన రఘు, జంపాన శ్రీనివాసగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



సేఫ్ రైడింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: ట్రాఫిక్ డిసిపి షరీన్ బేగం ఆధ్వర్యంలో నగరంలోని వాహనదారులకు సేఫ్ రైడింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపధ్యంలో నగరంలో బెంజ్ సర్కిల్ పరిసర ప్రాంతాలలో వాహనదారుల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు అధికారులు రోడ్లపై ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ ప్రయాణిస్తున్న వాహనదారులను ప్రత్యేకంగా గుర్తించి వారిని అభినందించారు. ఈ క్రమంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణించు సమయంలో వెనుక వ్యక్తి కూడా హెల్మెట్ ధరించి ప్రయాణించడం మరియు సీటు బెల్ట్ ధరించి క్రమబద్ధంగా డ్రైవ్ చేస్తున్న కారు డ్రైవర్లకు బెలూన్లు అందజేశారు. ఈ చర్య ప్రజల్లో సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంచడమే కాకుండా, ఇతరులకు కూడా మంచి ప్రేరణగా మారింది. డీసీపీ ట్రాఫిక్ షేక్ షరీన్ బేగం మాట్లాడుతూ 'హెల్మెట్ ధరించడం ఒక అలవాటు కాదు ఒక రక్షణ కవచం అని, సీటు బెల్ట్ ప్రాణాలను కాపాడే అతి శక్తివంతమైన పరికరమన్నారు. అలాగే ప్రజలందరూ తమతో పాటు ప్రయాణించే కుటుంబ సభ్యులు, స్నేహితులు కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



సంస్థాగత ఎన్నికల్లో బయట వ్యక్తుల ప్రమేయం తగదు



ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి సంస్థాగత ఎన్నికల్లో బయట వ్యక్తుల ప్రమేయం అభ్యంతరకరమని అది పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్ద నాయకులు బండే . రాఘవ, పర్చూరి. దుర్గాప్రసాద్, కర్ర సుధాకర్ విలేకరులతో మాట్లాడుతూ తాము పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూటమిలోని మిగిలిన పార్టీల అంతర్గత వ్యవహారాల్లో తల దూర్చడం లేదని, ఇదే విషయాన్ని ఎమ్మెల్యే ప్రసాద్ కూడా ఓటమి సమావేశాల్లో స్పష్టం చేశారు అన్నారు. అయితే మండల పార్టీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న ఓ వ్యక్తి ధర్మాన్ని, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పక్కన పెట్టి జనసేన, వైసిపి అనుభూతిపరులను తీసుకువచ్చి బల ప్రదర్శన చేయడం సిగ్గుచేటు అన్నారు. టిడిపి సమస్తాగత ఎన్నికలు జరిగే ప్రదేశానికి వచ్చిన వైసీపీ, జనసేన నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నించారని, కులాల ప్రస్తావన తీస్తూ వచ్చిన పరిశీలకులను సైతం బెదిరించేలా అనరాని మాటలు అన్నారని ఆరోపించారు. ఏ రాజకీయ పార్టీ అయినా గుర్తించి పదవులు, ఇతర అవకాశాలు కల్పిస్తుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అడపా శ్రీనివాసరావు, కంచర్ల ఆనంద్, కొల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.



592 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 592 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గాభవాని, కణితి శశిరేఖ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భవాని, ఎస్.దాశరథి తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అట్లూరి దిలీప్‌కుమార్, పాపయ్య, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

డోకిపర్రు ఆలయంలో అన్నదానం



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామి వారిని దర్శించు కునేందుకు ఆదివారం భక్తుల సందడి అధికమైంది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధనను నిర్వహించారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థిక సాయంతో జరిగింది. వేలాదిమంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులుబారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.



జెవివి నగర కమిటీ ఎన్నిక

విజయవాడ : సామాన్య ప్రజలకు విజ్ఞాన ఫలితాలు అందించే విధంగా జెవివి కృషి చేస్తోందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ తెలిపారు. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక విజయవాడ నగర మహాసభ జరిగింది. ఈ సభలో తవ్వా సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సైన్స్ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలను సులభ రీతిలో బోధించడం కోసం రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో 4 లక్షల 50 వేల మంది విద్యార్థులకు చెకుముకి సంబరాలు పాఠశాల విద్యార్థులకు నిర్వహించామని తెలిపారు. రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కాకినాడలో 3 రోజులపాటు జరుగుతాయని చెప్పారు. జెవివి రాష్ట్ర కోశాధికారి జి మురళీధర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ ఏ.పూర్ణానంద్, ఏ.మోహన్ రెడ్డి, అధ్యక్షులుగా ఎం.రత్న కమల్ బాబు, ప్రధాన కార్యదర్శిగా వెలగా శ్రీనివాస్, కోశాధికారిగా బోయి రవి ఎన్నికయ్యారు. నగర ఉపాధ్యక్షులుగా కెఎస్. భాను ప్రసాద్, కెఎస్.కోటేశ్వర రావు, పిఆర్కే రెడ్డి, బి.సురేష్ కుమార్, డి. సజన్ కుమార్, కార్యదర్శులుగా సిహెచ్ సుబ్బారావు, బి శోభన్ కుమార్, నాగేశ్వర రావు, సమత కన్వీనర్‌గా జి దుర్గ, యూత్ కన్వీనర్‌గా డాక్టర్ ప్రేమ్ చంద్‌తోపాటు ఎనిమిది మంది కమిటీ సభ్యులుగా నూతన కార్యవర్గం ఎన్నికయింది.



అలరించిన 'పాడనా వేణువై..'

విజయవాడ : 'శ్రీ మ్యూజికల్ ఈవెంట్' ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్‌లో "పాడనా వేణువై- సీజన్2' మకుటంతో సినీ సంగీత విభావరి జరిగింది. సత్య సౌమ్య (టీమ్ లీడర్), డాక్టర్ జె.వి.త్రివేణి, రాధిక, రవి, చలపతి, సుమలత, సుకన్య, సుభాష్ రాయ్, ఫణి దీపిక, శశిరేఖ, సత్యనారాయణ చౌదరి, అరుణశ్రీ, కమలి, చిన్నారి, అంజలి, ఆర్కే, జయచంద్ర, సురేష్, శ్రీనివాస్, సుదర్శన్, బద్రి, భద్రరావు తదితర ఔత్సాహిక గాయనీ గాయకులు వివిధ సినిమాల్లోని పాటలు పాడి ప్రేక్షకుల్ని అలరించారు. స్టూడియోస్ అధినేత సూర్య ట్రాక్స్ సమకూర్చారు. మున్నాభాయ్ సహకరించారు.

పిఎసిఎస్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- వత్సవాయి : ఎపి పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పిఎసి ఎస్ ఉద్యోగుల యూనియన్ వారికి ప్రెసిడెంట్ సామినేని హరికృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడంతో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ విధులకు హాజరైనట్లు తెలిపారు. జీవో 36 అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం జనవరి 5వ తేదీ వరకు దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

సాయుధ దళాల సేవలు అజరామరం

- ఇన్‌ఛార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్.ఇలక్కియ



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : దేశ రక్షణకు ప్రాణాలను అర్పించిన సైనికుల సేవలు వెలకట్టలేమని, సాయుధ దళాల నిధికి తోచిన సహాయం అందించి మాజీ సైనికుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే) పురస్కరించుకుని ఆదివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, ఇంచార్జ్ కలెక్టర్ ఇలక్కియ సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందించి జిల్లా సైనిక సంక్షేమ అధికారి నుండి పతాకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనికులు మొక్కవోని దీక్షతో చూపుతున్న దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల దేశం గర్విస్తుందన్నారు. దేశ రక్షణలో పాటుపాడుతున్న ప్రతి సైనికునికి మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. వారి రుణం తీర్చుకునే అవకాశం పతాక దినోత్సవం కల్పించిందన్నారు. వీర మరణం పొందిన సైనికుల తల్లిదండ్రులు, వితంతువులు అయిన భార్య పిల్లలకు మనకు తోచిన రీతిలో స్పందించి జిల్లా ప్రజలు వ్యాపార వేత్తలు పారిశ్రామిక వేత్తలు విద్యాసంస్థలు విరివిగా విరాళాలు అందించాలని ఇలాక్కియ పిలుపు ఇచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికార సర్జన్ లెఫ్టినెంట్ కమాండర్ కె.కళ్యాణ వీణ మాట్లాడుతూ యుద్ధ సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, వికలాంగులైన వారి సంరక్షణకు సామాజంలో ప్రతి ఒక్కరూ ఇతోదిక సహాయం అందిస్తే గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అండగా ఉన్నట్లవుతుందన్నారు. స్వచ్ఛందంగా విరాళాలు అందించేందుకు ముందుకొచ్చే వారు జిల్లా సైనిక సంక్షేమ అధికారి, ఎన్టీఆర్ జిల్లా పేరున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ ఖాతా 62067742138 నెంబర్ ఐఎఫ్ఎస్సీ కోడ్ ఎసబిఐఎన్ 0020899 ద్వారా నేరుగా తమ విరాళాలు అందించవచ్చని తెలిపారు. నగరానికి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ కాళి ప్రసాద్ ప్రతి ఏడాది సాయుధ దళాల పతాక నిధికి విరాళం ఇచ్చినట్లే ఈ ఏడాది కూడా రూ.25 వేలు ఇంచార్జ్ కలెక్టర్ ద్వారా అందజేసినందుకు ధన్యవాదాలు తెలిజేస్తున్నామని తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 24వ డివిజన్ కస్తూరిబాయిపేట, న్యూ గిరిపురం రెడ్ సర్కిల్ వద్ద చింతల సత్యంబాబు - చింతల ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం మా ఆర్ట్స్ అధినేతలు బాబీ, చంటి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేసి, సెమీ క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ నీతి నిజాయితీగా ఉండటం, తోటి వారి పట్ల ప్రేమను పంచడం అనేది క్రీస్తు సమస్త మానవాళికి అందించిన గొప్ప సందేశం, జీసస్ స్ఫూర్తితో మనమంతా ముందుకు నడుద్దాం అని, క్రీస్తు మార్గము ప్రపంచ శాంతికి దోహదం చేస్తుంది అని, క్రిస్మస్ వేడుకను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరుకున్నారు.

'విజన్ -2047' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గంలోని బిఆర్‌టిఎస్ రోడ్డు ఎస్‌టివిఆర్ మున్సిపల్ పై స్కూల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ నియోజకవర్గం యాక్షన్ ప్లాన్ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు, విజయవాడ ఎంపి కేశినేని శివనాద్ (చిన్ని), దూదేకుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గ అభివృద్ధి కోసం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను రూపొందించారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అధికారిక ఎమ్మెల్యే కార్యాలయాలతో పాటు ఆ నియోజకవర్గానికి ప్రత్యేకంగా విజన్ డాక్యుమెంట్- 2047'ను తయారు చేసి అమలు చేయడానికి ఏడుగురు అధికారులను ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. బోండా ఉమా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రజలకు మరింత చేరువగా ఉండి అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, ఉద్యోగ అవకాశాల విస్తరణ కోసం ప్రత్యేక డాక్యుమెంట్ రూపొందించి, దాన్ని అధికారుల ద్వారా అమలు చేయడానికి ఎమ్మెల్యేలే చైర్మన్‌గా నియమిస్తూ ఈ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మెకానిక్‌ల అభివృద్ధికి సహకారం: ఎంపి శివనాథ్




ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : వాహనాల తయారీలో వస్తున్న సాంకేతికను టూ వీలర్స్ మెకానిక్‌లు అందిపుచ్చుకోవాలని, అందుకు కావాల్సిన సహాయ సహకారం అందిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే స్టేడియంలో మెకానిక్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా ఎంపి కేశినేని శివనాథ్, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నలతో కలిసి హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో తలపడే నవరంగ్ మెకానిక్స్ జట్టు వర్సెస్ వన్‌టౌన్ మెకానిక్స్ జట్టు సభ్యులకు ఎంపి కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. స్టేడియంలో మెకానిక్స్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనులు చేస్తూ జీవించే వారికి క్రీడలు ఆట విడుపుగా ఉంటాయన్నారు. మెకానిక్స్ అందరూ ఒక ప్రొడక్ట్ తయారు చేసేందుకు క్లస్టర్‌గా ఏర్పడితే... అదనపు ఆదాయం రావటానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. నవరంగ్ మెకానిక్స్ జట్టు వర్సెస్ ఒన్ టౌన్ మెకానిక్స్ జట్టుకి జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఒన్‌టౌన్ మెకానిక్స్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, న్యూ నవ్యాంధ్ర టూ వీలర్స్ మెకానిక్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి

- ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని.. వారిపై పని భారం తగ్గించాలని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నగరంలోని గాంధీనగర్ ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో జరిగింది. కార్యక్రమానికి విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్జీజీవో అసోసియేషన్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. వారికి న్యాయంగా దక్కాల్సిన పదోన్నతులు, వేతన సవరణలపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. ఎపి ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.ఎస్.సాయిరాం, అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలు భర్తీ చేయాలని, పదోన్నతులకు సంబంధించిన రోస్టర్ పాయింట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఆల్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షునిగా వి.ఎస్.సాయిరాం (ఎన్‌టిఆర్), అధ్యక్షుడుగా ఎన్.చంద్రశేఖర్ (విశాఖ), సహాధ్యకుడుగా వి.శ్రీనివాసరావు (విజయనగరం), ఉపాధ్యక్షులుగా సిహెచ్. వీరవెంకయ్య (ఏలూరు), జి.శ్రీనివాసరావు (అనకాపల్లి), జి.నాగేశ్వరరావు (నెల్లూరు), కె.బాబూరావు (మన్యం), కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.బాలరాజు (కృష్ణా), ప్రచార కార్యదర్శిగా జి.గౌరి నాయుడు (పార్వతీపురం), సంయుక్త కార్యదర్సులుగా కె.శ్రీనివాసరావు (గుంటూరు), ఎం.బాలస్వామి (కర్నూలు)లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డిఎస్ఎన్.రెడ్డి ప్రకటించారు.

ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో విజయోత్సవ సభ



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని ప్రతిభ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ -2025 విజయోత్సవ సభ ఆదివారం నగరంలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ, సామాజిక, కార్పొరేట్ ప్రముఖులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ మాట్లాడుతూ.. ఈ సారి జరిగిన మెగా డిఎస్‌సిలో ప్రతిభ కోచింగ్ సెంటర్ నుంచి 358 మంది విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. శాసన సభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల అవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ డిఎస్సీ విద్యార్థుల కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభలో ప్రత్యేకంగా డిఎస్సీ విజయార్థులను సత్కరించారు.